# కోటి ఆశల "చేయూత"

-ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురుచూపు
-రూ.4వేల పెన్షన్ ఎప్పుడిస్తారోనన్న చర్చ
-గ్రేటర్‌లో 6.33లక్షల మంది లబ్దిదారులు
-పెండింగ్, కొత్త దరఖాస్తుదారులకు ఆశలు



**హైదరాబాద్, డిసెంబరు 23,ప్రభాతవార్త:** ఏడది క్రితం కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలపై దృష్టిసారించి ఇప్పటికే కొన్నింటికి శ్రీకారం చుట్టింది. రేషన్ కార్డులుసైతం ఇస్తామని ప్రకటించింది. లబ్దిదారులకు ఎంపికకు ప్రత్యేకంగా దరఖాస్తులను సైతం స్వీకరించింది. ఈనేపథ్యంలో మరోగ్యారెంటీ "చేయూత"పై ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గ్యారంటీ అమలైతే ..పేద కుటుంబాల బృద్దులు, వితంతులు, దివ్యాంగులు, చేనేత,కల్లుగీత ,ఒంటరి మహిళల తదితర సామాజిక పెన్షనర్ల 4వేలకు పెరగనుంది. ఈనేపథ్యంలో ఆయా వర్గాలవారు ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం నెలవారీగా రూ.2016 పెన్షన్ అందుతుండటంగా..ఈమొత్తం రూ.4వేలకు చేరనుంది. గ్రేటర్ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో మొత్తం మీద 6,33,209 మంది పెన్షన్ దారులు ఉన్నారు. వీరిలో దివ్యాంగులు 81,114 మంది ఉండగా..మిగిలిన వృద్దాప్య ,వితంతు, ఒంటరి మహిళలు, చేనేత, కల్లుగీత ,బిడి వర్కర్స్,హెచ్ఐవీ ఫైలేరియా తదితర పెన్షన్‌దారులు 5,52,095 మందికి పైగా ఉన్నారు. మరోవైపు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు మరో రెండులక్షల మంది వరకు ఉండవచ్చని అంచనా. దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ జరిగి సెర్ప్‌కు ప్రతిపాదనలు వెళ్ళినా మంజూరు మాత్రం పెండింగ్‌లోనే ఉండిపోయింది. దరఖాస్తు చేసుకోని వారు మరోలక్ష మంది వరకు ఉన్నట్లు తెలుస్తుంది.

**నాలుగేళ్లుగా ఎదురుచూపులు..**

గత ప్రభత్వంలో నాలుగేళ్లుగా కొత్త పెన్షన్ల మంజూరు ఊసే లేకుండా పోయింది. రెండేళ్ల క్రితం వయస్సు సడలింపు 57 ఏళ్లకు పైబడి వారి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించినప్పటికీ ..అందులో 40శాతం మాత్రమే మంజూరు లభించగా మిగతా తిరస్కరణకు గురయ్యారు. 65ఏళ్లు దాటిన వృద్ధాప్య, వివంతు, వికలాంగులు, ఒంటరి మహిళలు, కల్లుగీత, బీడీ తదితర ఫించన్ల కోసం ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నటికీ ఆమోద ముద్ర పడకపోవడం గమనార్హం. అలాగే వృద్ధాప్య పింఛన్‌దారు మృతి చెందితే అతని భార్య ఫించన్ మంజూరు ప్రక్రియ కూడా పెండింగ్‌లోనే మగ్గుతోంది. మరణ ధ్రువీకరణ పత్రం తీసుకుని దరఖాస్తుదారులు కలెక్టరేట్, తహసీల్దార్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న ఫలితం లేకుండా పోతుంది. అధికారులు సైతం ఫించన్లు ఎప్పుడు మంజూరవుతాయో స్పష్టత ఇవ్వకపోవడంతో పేద కుటుంబాలకు ఆర్థిక కష్టాలు తప్పడం లేదు. కొత్త ప్రభుత్వంలో అయినా తమ సమస్య పరిష్కరామవుతుందని కోటి ఆశలతో వారు ఎదురుచూస్తున్నారు.



# హైదరాబాద్ వార్త

## చెరువుల ఆక్రమణలపై హైడ్రా కమిషనర్ ఆగ్రహం

-తౌతానికుంట, భగీరథమ్మచెరువు, నెక్నాంపూర్ చెరువుల పరిశీలన
-కాలువలు మూసివేత, నీటిని మళ్ళింపు జరిగినట్లు గుర్తింపు
-క్షేత్రస్థాయిలో పరిశీలించిన నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం



ఆక్రమణకు గురైన చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, డిసెంబరు 23,ప్రభాతవార్త:** చెరువుల ఆక్రమణలపై హైడ్రా కమిషనర్ ఆగ్రహం వ్యకనతం చేశారు. కబ్జాలకు గురైన ప్రాంతాలను గుర్తించి స్థాయి విచారణ జరపాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈమేరకు సోమవారం ఓఆర్ ఆర్‌కు చేరువుగా ఉన్న పలు చెరువులను కమిషనర్ రంగనాథ్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. చెరువుల ఆక్రమణలపై ప్రజలతో పాటు.. ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా నానక్‌రామ్‌గూడకు చేరువలో ఉన్న తౌతాని కుంట, భగీరథమ్మ చెరువు, నార్సింగ్‌లోని నెక్నాంపూర్ చెరువుల ఆక్రమణలపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తౌతాని కుంట, భగీరథమ్మ చెరువుల ఆక్రమణలతో పాటు.. ఆయా చెరువల్లోకి వరద నీరు చేరకుండా కాలువలను మల్లించడం, మూసివేయడంపై రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులతో క్షుణ్ణంగా పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని హైడ్రా అధికారులకు కమిషనర్ ఆదేశించారు. చెరువులలో మట్టిపోయడంతో పాటు ఆఖరుకు వరద కాలువలను కూడా కనిపించకుండా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు తెలిపారు. ఖాళీస్థలంలో వర్షపు నీరు వెళ్లే రహదారులు మూసుకుపోవడంతో తమ అపార్టుమెంట్‌లోకి వరద నీరు వచ్చి చేరుతోందన్న స్థానికులు తెలిపారు. నానాక్‌రామ్‌గూడ ప్రధాన రహదారికి ఎగువన ఉన్న తౌతాని కుంట చెరువు నీరు.. దిగువవైపు ఉన్న భగీరథమ్మ చెరువుకు వెళ్లే కాలువ లింకు తెగిందని స్థానికులు కమిషనర్‌కు తెలిపారు. నానక్‌రామ్‌గూడకు ఉన్న ఇరువైపులా వరదనీటి కాలువలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు, దుకాణాలను తొలగించాలని కమిషనర్ ఆదేశం. యూనివర్సిటీ ఖాళీ స్థలంలోంచి వరద నేరుగా తౌతాని కుంటకు తర్వాత భగీరథమ్మ చెరువుకు చేరితే ఈ ఇబ్బంది తొలుగుతుందని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

చెరువులకు ఆనుకుని ఉన్న స్థలాలు తమవంటూ పలువురు కమిషనర్‌ను కలువగా పూర్తి వివరాలను హైడ్రాకు సమర్పిస్తే.. క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని చెప్పిన హైడ్రా కమిషనర్ తెలిపారు. గ్రామీణ మ్యాప్‌లతో పాటు.. నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ, సర్వే ఆఫ్ ఇండియా, తెలంగాణ విభాగాలకు చెందిన మ్యాప్‌లతో పూర్తి స్థాయి పరిశీలన జరిపించి వారం రోజుల లోపు నివేదిక సమర్పించాలని అధికారులకు ఆదేశించారు

## దివంగత ప్రధాని పివికి ప్రముఖుల నివాళి



పీవీఘాట్‌లో మాజీ ప్రధాని పీ.వీ.నర్సింహారావుకు నివాళులు అర్పిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.

**బేగంపేట డిశంబరు 23,ప్రభాతవార్త**

హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డు పీ.వీ.జ్ఞానభూమి పీ.వీ.మార్గ్‌లో దివంగత మాజీ ప్రధాని పీ.వీ.నర్సింహారావు 20వ వర్దంతి సంస్మరణ సభ సందర్భంగా పీ.వీ.ఘాట్ వద్ద కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ భారతరత్న మాజీ ప్రధాని పీ.వీ.నర్సింహారావు దేశానికి విశేషమైన సేవలు చేసారన్నారు.దేశ ఆర్థిక వ్యవస్థ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నపుడు భారత ప్రధానిగా అనేక రకాల ఆర్థిక సంస్కరణలు చేసిన తెలుగు బిడ్డ అన్నారు.మన తెలుగు నేల నుంచి మొట్ట మొదటి ప్రధాని పీ.వీ.అన్నారు. మారుమూల రగామాల్లో జన్మించి రాష్ట్రంలో కూడా అనేక పదవులు నిర్వహించారన్నారు.అనేకభాషలలో మంచి పట్టు ఉన్న రాజకీయనాయకుడన్నారు.దేశంలోనే అతి పెద్ద అవార్డు ఇచ్చిన నేటి ప్రధాని నరేంద్రమోదీ ఆయన చరిత్రను ముందుకు తీసుకు వచ్చారన్నారు.రాజకీయాలు వేరు అయినప్పటికీ మన దేశం కోసం పనిచేస్తున్నామన్న భావన పీ.వీ.దే అన్నారు.కేంద్ర ప్రభుత్వం తరుపున ఘన నివాళి అర్పిస్తున్నామన్నారు.




## ప్రఖ్యాత దర్శకుడు శ్యాం బెనగల్ కన్నుమూత

-అల్వాల్‌లో సొంత ఇల్లు, సోదరుడి కుమారుడు ఇప్పటికీ నివాసం
-1953లో ముంబాయికి వలస..



**అల్వాల్, డిసెంబరు 23 ప్రభాతవార్త:** ప్రముఖ దర్శకుడు శ్యామ్ బెనగల్ మృతి చెందడంతో అల్వాల్‌లోని ఆయన కుటుంబీకులులో విషాదం నెలకుని ఉంది. వృద్ధాప్య సమస్యలుతో ఆయన ముంబాయిలో తుది శ్వాస విడిచారు. శ్యామ్ బెనగల్ సికింద్రాబాద్ తిరిమలగిరిలో జన్మినించారు. కొంత కాలానికి అల్వాల్‌లో ఇల్లు కట్టుకుని కుటుంబం మొత్తం నివాసం ఉండే వారు. బెనగల్‌కు మొత్తం ఆరు మంది అక్కలు చెల్లెళ్ళుతో పాటుగా నలుగురు సోదరులు ఉన్నారు. ప్రస్తుతం దేవుని అల్వాల్‌లో పాత భవనంలోనే బెనగల్ తుమ్ముడి కొడుకు బెన్నీ తన ఇద్దరు కూతుళ్ళుతో నివాసం ఉంటున్నారు. 1934 డిసెంబరు 14న జన్మించిన శ్యామ్ బెనగల్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఎ(ఎకనామిక్స్) చదివారు. 1953లో భార్య కూతురు పియ బెనగర్‌తో కలిసి హైదరాబాద్ నుంచి ముంబాయికి వెళ్ళి యాడ్ ఏజెన్సీలో కాపీ రైటర్‌గా అనంతరం మరో కంపెనీలో క్రియేటివ్ హెడ్‌గా పని చేశారు. 1962లో ఓ గుజరాతీ డాక్యుమెంటరీ ద్వారా వెలుగులోకి వచ్చారు. అంకుర్ చిత్రం ఆయనను దర్శకుడిగా ఉన్నత శిఖరాలకు చేర్చింది. ఆ చిత్రం ద్వారా జాతీయ అవార్డును అందుకున్నారు. మంథన్, నిషాంత్, భూమిక, సమర్, హరి భరీ, మండీ చిత్రాలు ఆయన ప్రతిభకు గీటురాళ్ళుగా నిలిచాయి. శ్యామ్ బెనగల్ ఆఖరి చిత్రం ముజిబ్ గత ఏడాది విడుదలైంది.

**అల్వాల్‌లో చిన్ననాటి గుర్తులు**

దేవుని అల్వాల్‌లో ఇప్పటికి శ్యామ్ బెనగల్ కుటుంబానికి చెందిన ఇల్లు ఉంది. బెనగల్ సోదరుడి కుమారుడు బెన్నీ ఇప్పటికి అదే ఇంటిలో నివాసం ఉంటున్నారు. తిరిమలగిరిలో జన్మించినా చిన్నతనం నుంచి వివాహం అయ్యేంత వరకు అల్వాల్‌లోనే గడిపారు. బెనగల్ సోదరులు సోదరీమణులు పది మంది ఇక్కడే పెరిగారు. ఉద్యోగ, వ్యాపార, సినీ రంగాలులో సోదరులు అంతా దేశంలోని వివిధ ప్రాంతాలకు వలస వెళ్ళడం జరిగింది. శ్యామ్ బెనగల్ 1953లో భార్య కుమార్తెతో ముంబాయిలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. దశాబ్దాలు కాలంగా ఆయన అల్వాల్‌కు వచ్చిన దాఖలాలు కూడా లేవు. ఇల్లు కూలి పోయే స్థితికి వచ్చేసింది.

## కనీస వేతన సలహా మండలిలో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలి

**చిక్కడపల్లి డిసెంబరు 23 ప్రభాతవార్త:** కనీస వేతనాల సలహా మండలిలో రాష్ట్రంలోని అన్ని కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం లేకుండా విడుదల చేసిన జీఓ నెం. 21ని సవరించి అన్ని కార్మిక సంఘాలకు కనీస వేతనాల సలహా మండలిలో ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ ఆందోళన కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ మాట్లాడుతూ తక్షణమే ఆ జిఓను సవరణ చేసి మండలిలో అన్ని యూనియన్లకు ప్రాతినిధ్యం కల్పించాల్సిందిగా డిమాండ్ చేశారు. 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్లో కోటి మందికి సంబంధించిన వేతనాలు పెంచకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. కేంద్ర బిజెపి విధానాలనే కొనసాగిస్తున్నదని అన్నారు. ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్, బిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్, టియుసిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సూర్యంలు మాట్లాడుతూ కార్మికుల కనీస వేతనాల కోసం వారి హక్కుల కోసం దశాబ్ధాలుగా పోరాడుతున్న సంఘాల సలహాలు తీసుకునేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా లేదు. ప్రజా ప్రభుత్వం, కార్మిక ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల, కార్మిక సంఘాలను విస్మరిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ మరియు సలహా మండలి సభ్యులను కార్మికుల ప్రయోజనాల కోసం కాకుండా ప్రభుత్వం చెప్పుచేతల్లో ఉండే విధంగా నిబంధనలకు విరుద్ధంగా నియమించిదన్నారు. ఐఎఫ్ టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు శివబాబు, హెచ్ఎంఎస్ జంట నగరాల అధ్యక్షులు అంజాద్, కనీస వేతనాల సలహా మండలి మాజీ చైర్మన్ నారాయణ, సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఎస్. రావు, రాష్ట్ర కార్యదర్శులు జె. చంద్రశేఖర్, కూరపాటి రమేష్, టియుసిఐ నాయకులు పద్మ, సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్. కోటంరాజు, యాటల సోమన్న, పి. సుధాకర్, అశోక్, రామ్మోహన్, కుమారస్వామి, బాలు నాయక్ పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి వార్షిక బడ్జెట్ "రూ.8,440 కోట్లు"

-ఆమోదించిన స్టాండింగ్ కమిటీ



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లడుతున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ, కమిషనర్ ఇలంబర్తి తదితరులు

**హైదరాబాద్, డిసెంబర్ 23,ప్రభాతవార్త:** 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీహెచ్ఎంసీ రూ. 8,440 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంచనా ప్రతిపాదనలను సోమవారం జరిగిన ప్రత్యేక బడ్జెట్ సమావేశంలో స్టాండింగ్ కమిటి ఆమోదించింది.నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక బడ్జెట్ సమావేశానికి జీహెచ్ఎంసీ కమీషనర్ ఇలంబర్తి, స్టాండింగ్ కమిటీ సభ్యులు, బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, మహమ్మద్ ముజఫర్ హుస్సేన్, మహమ్మద్ ఖదీర్, మన్నె కవితా రెడ్డి, మహమ్మద్ రషీద్ ఫరాజుద్దిన్, ఉప్పలపాటి శ్రీకాంత్, సబిహ బేగం, చింతల విజయ శాంతి, కంది శైలజ, అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, గీతా రాధిక, సుభద్ర దేవి, నళిని పద్మావతి, వేణుగోపాల్ రెడ్డి, సత్యనారాయణ, పంకజ, సరోజ, అశోక్ సామ్రాట్, రఘు ప్రసాద్, చంద్ర కాంత్ రెడ్డి, యాదగిరి రావు, జోనల్ కమిషనర్లు అపూర్వ చౌహాన్, అనురాగ్ జయంతి, రవికిరణ్, వెంకన్న, ఉపేందర్ రెడ్డి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వెంకటేశ్వర్ రెడ్డి, ఫైనాన్స్ అడ్వైజర్ శరత్ చంద్ర, సిసిపి శ్రీనివాస్, చీఫ్ వెటర్నరీ అబ్దుల్ వకీల్, సి.ఇ మెయింటెనెన్స్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బడ్జెట్‌పై స్టాండింగ్ కమిటీ సమావేశంలో విస్తృతంగా చర్చించి ఆమోదించారు. పలు విభాగాలకు సంబంధించి అడిగిన సభ్యుల సందేహాలను ఆయా అధికారులు నివృత్తి చేశారు. ఇదివరకే అధికారులు రూ. 8340 కోట్లతో రూపొందించి రెవెన్యూ ఆదాయంగా రూ. 4205 కోట్లు , రెవెన్యూ వ్యయం రూ. 3936 కోట్లు, పెట్టుబడుల ఆదాయం రూ. 4404 కోట్లు, పెట్టుబడుల వ్యయం రూ. 4404 కోట్లు ప్రతిపాదించారు. అయితే గత నవంబర్ 30 తేదీన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ ప్రతిపాదనలపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ, బడ్జెట్ అంఛనాలను మార్చాలని సూచించారు. దీంతో అధికారులు స్టాండింగ్ కమిటీ సభ్యుల సూచన మేరకు రూ. 60 కోట్లు పెంచి మొత్తం బడ్జెట్ ను రూ. 8400 కోట్లుగా మార్చారు. రెవెన్యూ ఆదాయాన్ని రూ.195 కోట్లు పెంచుతూ రూ. 4400 కోట్లుగా అంఛనాలు వేశారు. నవంబర్ 30 నాటి బడ్జెట్ అంఛనాల్లో పెట్టుబడుల ఆదాయం రూ.4404 కోట్లు కాగా, రూ. 4కోట్లను తగ్గించి, రూ. 4400 కోట్లు గా పేర్కొన్నారు. పెట్టుబడుల వ్యయంలోనూ రూ. 4 కోట్లను తగ్గిస్తూ, తాజాగా ప్రతిపాదనలో రూ.4400 కోట్లుగా నిర్ణయించారు.

## రైతాంగం పట్ల కేంద్ర ప్రభుత్వం విధానాలు మార్చుకోవాలి

**చిక్కడపల్లి, డిసెంబరు 23 ప్రభాతవార్త:** సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం నగరంలోని ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ వద్ద నిరసన తెలిపి కేంద్ర వ్యవసాయ మార్కెట్ విధానం ప్రతులను దగ్ధం చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా కేంద్ర నాయకులు బి.వెంకట్, రాష్ట్ర కన్వీనర్లు టి.సాగర్, , పశ్యపద్మ, విస్సా కిరణ్, బి.రాము, వస్కుల మట్టయ్య, సదానందం,ప్రసాదన్న, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.... మోడీ ప్రభుత్వం 3 వ్యవసాయ చట్టాలను రద్దుచేసి చాప కింద నీరులా అమలు చేయడానికి పూనుకున్నారని అన్నారు. మార్కెట్ చట్టాలను రాష్ట్రంలో రూపొందించుకుంటే మద్దతు తెలుపుతామని కేంద్రం అనడం హాస్యాస్పదం అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల మీద బలవంతంగా రుద్దే ప్రయత్నం జరుగుతుందని అన్నారు. కేంద్రం చేసిన విదానాన్ని రాష్ట్రాలు అమలు చేస్తే పంటలు, సాగు విస్తీర్ణం తగ్గుతుందని అన్నారు. దీనితో ఆత్మహత్యలు పెరుగుతాయని అన్నారు. నోయిడాలో ఆందోళన చేస్తున్న రైతులపై అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టిన పరిస్థితి ఉంది. రైతులు శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే అక్రమమైన కేసులు పెట్టారు. మెట్రో స్టేషన్‌కి వెళ్లి అక్కడ ఆపడానికి ప్రయత్నించారని తప్పుడు కేసులు బనాయించారు. కేంద్రంలోని నరేంద్ర మోడి ప్రభుత్వం ఈ కేసులన్నింటిని ఉపసంహరించుకోవాలిని అన్నారు. వ్యవసాయ మార్కెట్ల ముసాయిదాను ఉపసంహరించుకోవాలని అన్నారు. రైతులకు రాత పూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇప్పటివరకు ఏం చేశారు అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే ఆందోళన పోరాటాల్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ఎస్.వి రమ, ఎస్‌కెఎం నాయకులు ఆర్ వెంకట రాములు, శంకర్ ,కొండల్,ప్రభులింగం,బి.ప్రసాద్, మూడ్ శోభన్, బొప్పని పద్మ, డివైఎఫ్ ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, యస్ ఎఫ్ ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు,పిండి యస్ యు రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో సోమవారం కేంద్ర వ్యవసాయ మార్కెట్ విధానం ప్రతులను దగ్దం చేస్తున్న వ్యవసాయ కార్మిక, ప్రజాసంఘాలు

## సారంగి ఫిలిమ్ అవార్డుల ప్రదానోత్సవం

**రవీంద్రభారతి, డిసెంబరు 23 ప్రభాతవార్త :** ప్రపంచంలో ప్రజలతో ముడిపడిన అత్యంత సంక్లిష్టమైన వృత్తుల్లో మొదటిది రాజకీయమైతే రెండోది సినిమా రంగమని, ఈ రెంటిలో ఇమడం, నెగ్గుకురావడం కత్తిమీద సాము, అరచేతిలో వైకుంఠంలాంటివన్న తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ నేలపై సంవత్సరాలుగా ఎన్ని కళలు విరాజిల్లుతున్నా సినిమా ఆ కళలన్నింటినీ తలదన్ని రారాజుగా వెలుగులీనుతుందన్నారు. ప్రముఖ సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థ సారంగి ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ప్రతిభావంతులైన పలువురు వర్ధమాన తెలుగు సినీనటులకు ప్రతిష్టాత్మక సారంగి ఫిల్మ్ అవార్డులు, సమాజంలో వివిధరంగాల్లో విశేష సేవలందిస్తున్న సేవామూర్తులకు సారంగి సామాజికసేవా పురస్కారాల ప్రదానోత్సవం సంస్థ వ్యవస్థాపక అధినేత, సీనియర్ పాత్రికేయుడు ఖాజా ఆఫ్రిది నేతృత్వంలో కన్నులపండువగా జరిగింది. ఈ సందర్భంగా ఖాజా అఫ్రిది సామాజిక సేవారంగంలో తమ సంస్థ పదేళ్లుగా అనేకమంది దివ్యాంగులకు చేయూత అందించడంతోపాటు వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సారంగి సాంస్కృతిక ప్రయాణంలో సారంగి ఫిల్మ్ అవార్డుల ప్రదానం కలికితురాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. మామిడి హరికృష్ణ విశిష్ట అతిథులు నంది అవార్డు గ్రహీత, సినీవిమర్శకుడు పొన్నం రవిచంద్ర, నీహారిక, హరిప్రసాద్, జయంత్‌రెడ్డి, ఖాజా ఆఫ్రిది, దైవజ్ఞశర్మ తదితరులతో కలిసి ఉత్తమ నటుడుగా చైతన్యరావు; నటిగా భావన; దర్శకుడుగా వేణుఎల్దండి; గేయరచయితగా కాసర్లశ్యామ్; సంగీత దర్శకుడు చరణ్ అర్జున్; గాయకుడు రఘురామ్; హాస్యనటుడు రచ్చరవి; తొలిసినిమా దర్శకుడు అక్షరకుమార్; పీఆర్వో హరీష్; దర్శకురాలు మంజుల; గాయని నీహా; ఉత్తమ ఫిలిమ్ బ్రాండింగ్‌గా సినిటేరియా మేనేజింగ్ డైరెక్టర్‌గా బులిమోని వెంకటేశ్వర్లు, సినిమాటోగ్రఫీ శేఖర్ తదితరులకు ప్రతిష్టాత్మక సారంగి ఫిలిమ్ అవార్డులను ప్రదానంచేసి ఎంతగానో అభినందించారు. సభకుముందు జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులైన అశేష ప్రజానీకాన్ని ఉర్రూతలూగించడంతోపాటు మంత్రముగ్ధులనుచేసి సంగీతలోకంలో ఓలలాడించాయి.



సారంగి ఫిలిమ్ అవార్డులను ప్రదానం చేస్తున్న మామిడిహరికృష్ణ, ఖాజాఆఫ్రిది, రవిచంద్ర, నీహారికరెడ్డి తదితర అతిథులు

## బలిజేపల్లి లక్ష్మీకాంతం నాటక రచనలో దిట్ట : వక్తలు


ప్రసంగిస్తున్న సాహితీ కిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు

**చిక్కడపల్లి, డిసెంబరు 23 ప్రభాతవార్త:** బలిజేపల్లి లక్ష్మీకాంత కవి నాటక రచనలో దిట్ట అని, అయన రచించిన సత్య హరిశ్చంద్రియ నాటకం వేల ప్రదర్శనలు జరిగి నాటికీ నేటికీ నిత్య నూతనంగా వుందని సాహితీ కిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు అన్నారు. సోమవారం శ్రీ త్యాగరాయ గాన సభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు మధురస్మృతులలో భాగంగా నాటక రచయిత, కవి, అవధాని, నటుడు బలిజేపల్లి లక్ష్మీకాంత కవి సంస్మరణ సభ త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళావీఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగింది. పుత్తూరు సుబ్బారావు మాట్లాడుతూ బలిజేపల్లి లక్ష్మీకాంతం కవిగానే కాకుండా అసాధారణ అవధాన పండితుడు అని వివరించారు. గానసభ అధ్యక్షుడు కళా విఎస్. జనార్థన మూర్తి మాట్లాడుతూ బలిజేపల్లి లక్ష్మీకాంతం నాటక కర్త గానే కాక నటుడుగానే కాకుండా స్వాతంత్ర సమరం లో జైలుకు వెళ్లారన్నారు. వర విక్రయం వంటి సినిమాలలో నటించిన అయన పలువురు నాటి తరం నటులకు మార్గ దర్శనంగా నిలిచారని వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, కళాపోషకులు బింగి నరేందర్ గౌడ్, గాయని శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## మారుతీనగర్ కాలనీ పార్కును కబ్జా నుంచి విడిపించాలి


కమిషనర్ ప్రదీప్ కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న బిఆర్ఎస్ నేతలు

**నార్సింగి, డిసెంబర్ 23 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపల్ మారుతీనగర్ కాలనీలో పార్కు స్థలాన్ని కబ్జాదారుల చెర నుంచి విడిపించాలని కోరుతూ సోమవారం కమీషనర్ ప్రదీప్ కుమార్‌కు వినతిపత్రంను అందజేశారు. ఈ సంరద్భంగా బిఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షులు ధూళిపాళ్ల సీతారాం మాట్లాడుతూ మారుతీనగర్ కాలనీలో మా పార్టీ నాయకుల బృందం పాదయాత్ర చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు మా దృష్టికి వచ్చాయని, వాటిని మున్సిపల్ అధికారులకు తెలియజేసి పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. కాలనీలో రోడ్డు నెంబర్ 3,5లలో విద్యుత్ స్థంభాలు ఆక్రమణకు గురయ్యాయని, అలాగే 1100.గజాల పార్కు స్థలంలో 500.గజాల స్థలంను కబ్జా చేశారని, దీన్ని వెంటనే కబ్జాదారుల నుంచి విడిపించాలని కమీషనర్‌ను కోరామన్నారు. ఇందుకు కమీషనర్ ప్రదీప్ కుమార్ సానుకూలంగా స్పందించారని, విచారణ జరిపించి పార్కు స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకుంటామని మాటిచ్చినట్లు సీతారాం వివరించారు. ఈ పాదయాత్రలో బిఆర్ఎస్ నాయకులు కంబగళ్ల ధనరాజ్, అందె లక్ష్మణ్‌రావ్, గుట్ట మీద రాఘవేంద్ర, రూపారెడ్డి, లక్ష్మయ్య, రాజేంద్రప్రసాద్, విజ యలక్ష్మీ, మాల్యాద్రినాయుడు,సుమన్,సుమ,నళిని,అనూష, ప్రవీణ్, సంఘం శ్రీకాంత్, జయరాం, తిరుపతి మొదలైన వారు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ పరమత సహనం పాటించాలి : బండి రమేష్


క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 23, ప్రభాతవార్త**

ప్రతి ఒక్కరూ పరమత సహనం పాటించాలని, ఎదుటివారిని ప్రేమించేగుణం మనలో ఉండాలని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. సోమవారం మూసాపేట జనతానగర్‌లో ఆదివారం రాత్రి జరిగిన క్రిస్మస్ వేడుకలకు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ప్రపంచ మానవాళికి అనుసరణీయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్షమాగుణంతో సర్వ ప్రాణులను ప్రేమిస్తే యావత్ ప్రపంచం సంతోషంగా ఉంటుందన్నారు. ఏసుక్రీస్తు ఈ లోకంలోని ప్రజలందరికీ ప్రేమ, అప్యాయతను నేర్పించారని, మానవులు ఎప్పుడూ ప్రేమను, కరుణను, క్షమను కలిగి ఉండాలని ఏసు క్రీస్తు చేసిన బోధనలు మానవాళికి మార్గదర్శకాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, మోయిజ్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఆరిఫ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో అంబర్‌పేట ఆదర్శవంతమైన డివిజన్ -ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


అంబర్‌పేటలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌లు

**హైదరాబాద్, డిసెంబరు 23, ప్రభాతవార్త:**

ప్రజాసమస్యలను తెలుసుకొని అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయడంలో అంబర్‌పేట డివిజన్ ఆదర్శవంతమైనదని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్‌లో స్థానిక డివిజన్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్‌గౌడ్‌తో కలిసి 13 లక్షల రూపాయల అంచనా వ్యయంతో సిసి రోడ్ పనులను ప్రారంభించారు.అనంతరం ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌లు పటేల్‌నగర్‌లోని పలు బస్తీలలో పాదయాత్ర నిర్వహించారు. స్థానికంగా ఉన్నటువంటి డ్రైనేజీ,రోడ్ ప్యాచ్ వర్క్ సమస్యలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకుని వెంటనే సంబంధిత అధికారులు సిబ్బందికి సమస్యను వివరించి వెంటనే నూతన డ్రైనేజ్ పైప్ లైన్ పనులకు కావలసిన ఎస్టిమేట్ సిద్ధం చేసి పనులను ప్రారంభించాలని తెలియజేశారు.అనంతరం ఎమ్మెల్యే, కార్పొరేటర్‌లు పటేల్‌నగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో కూర్చొని కార్యకర్తలతో సమావేశమై వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని తన దృష్టికి తీసుకురావాలని కోరారు. మంచి పనులు చేపడుతూ ప్రజల గుండెల్లో నిలవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు తరుణ్‌కుమార్, వర్క్ ఇన్స్పెక్టర్ దుర్గ, రమేష్, బిఆర్ఎస్ పార్టీ అంబర్ పేట్ డివిజన్ ప్రధాన కార్యదర్శి జాఫర్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు,మైనార్టీ నాయకులు, స్థానిక బస్తీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మణికొండ తిరుమలహిల్స్ కాలనీ స్థలం కబ్జాకు యత్నం

- కమిషనర్ దృష్టికి తీసుకెళ్లిన అధ్యక్షులు డాక్టర్ అవినాష్
- పనులు ఆపివేసిన టౌన్‌ప్లానింగ్ సిబ్బంది


మణికొండ మున్సిపల్ తిరుమలహిల్స్ కాలనీలోని ఖాళీస్థలంను అడ్డుకున్న మున్సిపల్ అధికారులు

ఖాళీ స్థలాన్ని మున్సిపల్ అధికారులే కాపాడాలి : డాక్టర్ అవినాష్

**నార్సింగి, డిసెంబర్ 23 ప్రభాతవార్త :** మనికొండ మున్సిపాలిటీలోని పుప్పాలగూడ గ్రామ సర్వే నెంబర్లు 87,119లో 2008.వ,సంవత్సరంలో హుడా అనుమతితో తిరుమలహిల్స్ కాలనీ లేఔట్ చేశారు. ఆ సమయంలోనే ప్లాట్లు, రోడ్లు, పార్కులు పోనూ 6,024. స్క్వయర్ యార్డ్స్ స్థలాన్ని కాలనీ ప్రజల భవిష్యత్తు అవసరాల కోసం ఖాళీగా ఉంచారు. ఇటీవల భూముల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో మణికొండ మున్సిపల్ ప్రాంతం ప్రైమ్ ఏరియగా మారిపోయింది. దీంతో కొంత మంది కబ్జాదారులు ఈ ఖాళీ స్థలాన్ని కొట్టేసి, సొమ్ము చేసుకునేందుకు పావులు కదుపడం ప్రారంభించారు. 2020.లో ఈ స్థలం మాదని కొంత మంది వచ్చి చదును చేయడంతో కాలనీ వాసులంతా వారి పనులను అడ్డుకున్నారు. దీంతో అప్పటి నుంచి ఈ స్థల వివాదం కోర్టులో కొనసాగుతుంది. మళ్లీ ఈ నెల 21.వ,తేదీన రాత్రి సమయంలో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఖాళీ స్థలంను చదును చేసి వెళ్లారు. తిరిగి 23.వ,తేదీన జేసీబీలు తీసుకు వచ్చి పనులు చేయిస్తుండగా తిరుమలహిల్స్ కాలనీ వాసులంతా కలిసి అధ్యక్షుడు డాక్టర్ అవినాష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మణికొండ మున్సిపల్ కమీషనర్‌కు ఖాళీ స్థలం కబ్జా విషయంను ఫిర్యాదు చేశారు. వెంటనే కమీషనర్ ప్రదీప్ కుమార్ స్పందించి టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపించి పనులను ఆపివేసి, జేసీబీలను అక్కడి నుంచి పంపించారు. ఈ స్థలం తిరుమలహిల్స్‌కు చెందినదని, దీని విషయమై ఇంకా కోర్టులో కేసు నడుస్తుందని, ఈ స్థలం వద్దకు ఎవరు వచ్చినా చట్ట పరిధిలో కేసులు పెడ్తామని కమీషనర్ ప్రదీప్ కుమార్ హెచ్చరించారు. దీంతో సదరు కబ్జాదారులు చేసేదేమీ లేక తోక ముడిచారు.

తిరుమలహిల్స్ కాలనీలో ఉన్న ఖాళీ స్థలం 6,024.స్క్వయర్ యార్డ్స్‌ను కాపాడాల్సిన బాధ్యత మణికొండ మున్సిపల్ అధికారులదేనని కాలనీ అధ్యక్షులు డాక్టర్ పి.అవినాష్ పేర్కొన్నారు. మా కాలనీ ఏర్పడి 20.ఏళ్లు అవుతుందని, అప్పటి నుంచి ఇక్కడ ఈ ఖాళీ స్థలం ఉందని, మా కాలనీ ప్రజల భవిష్యత్తు అవసరాల కోసం ఈ స్థలాన్ని వదిలిపెట్టడం జరిగిందని వివరించారు. మున్సిపల్ అధికారులు ఈ స్థలం చుట్టూ ప్రహారీగోడను నిర్మించి, ఇక్కడ ఎవరూ ఎలాంటి పనులు చేపట్టరాదని బోర్డును పెట్టి కాపాడాలన్నారు. కమీషనర్ వెంటనే ఇందులో పార్కు/ఓపెన్‌జిమ్/ కమ్యూనిటీహాల్ వంటి ప్రజోపయోగకరమైన వాటిని ప్రారంభించాలని తిరుమలహిల్స్ కాలనీ వాసులమంతా కోరుతున్నామన్నారు. మేము సమాచారం ఇచ్చిన వెనువెంటనే కమీషనర్ ప్రదీప్ కుమార్ స్పందించి కబ్జాదారులను వెల్లగొట్టి, విలువైన స్థలాన్ని కాపాడినందుకు ధన్యావాదాలు తెలుపుతున్నామని అవినాష్ వివరించారు.

## విద్యార్థులు పరిశోధనల వైపు దృష్టి సారించాలి : ప్రొఫెసర్ ఎస్.కె. మహమ్మూద్

**హైదరాబాద్, డిసెంబరు 23 ప్రభాతవార్త**

దేశ ఆర్థికాభివృద్ధిలో భాగంగా విద్యార్థులు పరిశోధనల వైపు ముందుకు సాగాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.కె. మహమ్మూద్ అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవంతి విద్యా సంస్థల ఆధ్వర్యంలో టెక్ స్టార్మ్ 2024 పేరిట అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ ఎస్.కె.మహమ్మూద్ మాట్లాడుతూ జ్ఞానాన్ని పెంచుకున్నప్పుడే అది మన అభివృద్ధికి దోహదపడుతుందని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య మంచి సంబంధాలను మెరుగు పరుచుకోవాలన్నారు. అప్పుడే వారిలో నైపుణ్యత పెరుగుదలకు దోహదపడుతుందన్నారు. ప్రతిభ ఎవరి సొత్తు కాదని తాము ఎంచుకున్న రంగంలో నైపుణ్యతను సాధిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకుంటే ప్రపంచ వ్యాప్తంగా మంచి అవకాశాలు లభిస్తాయని సూచించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో కూడా మంచి అవకాశాలు వస్తాయన్నారు. అవంతి విద్యా సంస్థల చైర్మన్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ కళాశాలలో చదివే విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్మెంట్ ద్వారా ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎస్.కె. మహమ్మూద్, చిత్రంలో అవంతి విద్యాసంస్థల చైర్మన్ ఎం.శ్రీనివాసరావు తదితరులు

ఇష్టంగా, సమిష్టిగా, పట్టుదలతో చదివేవారు అన్ని రంగాల్లో రానిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ రిజిస్టార్ ప్రొఫెసర్ జి.నరేష్రెడ్డి, ప్రొఫెసర్ డి.కరుణసాగర్, జితేందర్సింగ్, ప్రొఫెసర్ ఎన్. కిషోర్కుమార్, ప్రొఫెసర్ కె.శ్యామల, శ్రీనివాస్ నామాల, కళాశాల హెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ వై. జయప్రద, ప్రిన్సిపల్స్ ప్రొఫెసర్ వి.అప్పారావు, డాక్టర్ ఎస్.అప్పారావు, డాక్టర్ జి.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అతిథులను అవంతి విద్యాసంస్థల చైర్మన్ ఎం.శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు.

# భువనేశ్వరి రచనలు నేటిసమాజానికి ఆదర్శం!

**చిక్కడపల్లి, డిసెంబరు 23 ప్రభాతవార్త:** ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత్రి భువనేశ్వరి మారేపల్లి రచనలు నేటి సమాజానికి ఆదర్శమని రాష్ట్ర ఖనిజశాఖ,మాజీడైరెక్టర్ ప్రముఖకవి డా.వి.డి.రాజగోపాల్ పేర్కొన్నారు. సోమవారం భారతీయ సాహిత్య అనువాదఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖకవి డా.బిక్కి కృష్ణ అధ్యక్షతన ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని కళాభారతిలో భువనేశ్వరి హిందీ అనువాదగ్రంథం" గురువోంక గురు" పుస్తకావిష్కరణ సభ జరిగింది.వేద గురువుల గురించి ఎన్నోపరిశోధనలు చేసి రచయిత్రి అనేక గ్రంథాలురాశారని ప్రముఖ అనువాదకురాలు డా.పి. విజయలక్ష్మిపండిట్ తెలిపారు.ప్రాచీన గురువులతోపాటు శంకరాచార్యుని సౌందర్యలహరి గ్రంథానికి చక్కని వ్యాఖ్యానం రాశారని ప్రముఖ కవి డా.జెల్దివిద్యాధర్ పేర్కొన్నారు.భువనేశ్వరి తెలుగులో రాసిన గురువులను గురువు గ్రంథాన్ని ప్రొఫెసర్ డా.యం.యశోదాదేవి అద్భుతంగా అనువదించారని దక్షిణభారత హిందీ ప్రచారసభ అనువా



'గురువోంక గురు" పుస్తకాన్ని ఆవిష్కరించిన దృశ్యం

దకులు అబ్బూరి జానకి,మిరియాల రాధాకృష్ణులు కొనియాడారు.ఆధునిక సమాజానికి మన సంస్కృతి ప్రాచీన గురువుల చరిత్రలు తెలియజేయడానికే తాను ఆధ్యాత్మిక గ్రంథాలు రాశానని రచయిత్రి భువనేశ్వరి చెప్పారు ఈ సందర్భంగా భువనేశ్వరి దంపతులను ఘనంగా సన్మానించారు. కవయిత్రులు రాధా కుసుమ,పద్మశ్రీలతలు నిర్వహించిన కవిసమ్మేళనం అందరినీ అలరించింది.

## ఆధ్యాత్మికశోభతో శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాస మహోత్సవాలు

**నాంపల్లి, డిసెంబరు 23 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ఎస్‌బిహెచ్ కాలనీ గాంధీనగర్‌లో కొలువైన ఉన్న అతిపురాతన శ్రీ సంగమేశ్వరస్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 16వ తేదీ సోమవారం నుండి నిర్విరామంగా జరుగుతున్న ధనుర్మాస మహోత్సవాలు వందలాది మంది భక్తుల భక్తిప్రపత్తులు ఆధ్యాత్మికశోభతో 14 జనవరి 2025 మంగళవారం వరకు నెలరోజులపాటు ధనుర్మాస (తిరుప్పావై) మహోత్సవాలు అత్యంత వైభవంగా శ్రీ పాంచరాత్రాగమానుసారంగా, వైష్ణవ సంప్రదాయం ప్రకారం నేత్రపర్వంగా జరుగుతున్నాయి. ఈ నెలరోజులపాటు జరిగే ధనుర్మాస విశేష కైంకర్యములు (ప్రత్యేక పూజలు)లో భాగంగా 16 సోమవారం ఉదయం 4.52గంటలకు తిరుప్పావై ప్రబంధ సేవాకాలం, ప్రథమ పాశురము ప్రారంభం కాగా, 26 గురువారం ఉదయం 9గంటల నుండి లక్ష తులసీ అర్చన; 2025 జనవరి 2 గురువారం ఉదయం 9.30గంటల నుండి శ్రవణా నక్షత్రం సందర్భంగా శ్రీవారి కళ్యాణం; జనవరి 8 బుధవారం రాత్రి 7గంటలకు దీపోత్సవం; 10 శుక్రవారం ఉదయం 3గంటల నుండి వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి) పర్వదిన సందర్భంగా శ్రీవారి అభిషేకము తదుపరి అలంకారం, విశేష పుష్పాలంకరణ, వైకుంఠ రంగనాథుడి అలంకారం, ఉత్తరద్వార దర్శనం, వెండి పుష్పార్చణలు; 11 శనివారం ఉదయం 7గంటల నుండి కూడారై ఉత్సవం; 13 సోమవారం రాత్రి 7గంటలకు గోదాకళ్యాణ మహోత్సవంలతోపాటు ప్రతీరోజూ సాయంత్రం 5గంటల నుండి విష్ణు సహస్రనామ పారాయణం ఉంటుందని ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లక్ష్మారెడ్డి తెలుపుతూ అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఆయా ప్రత్యేక పూజాది కార్యక్రమాల్లో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామి వారి కృపకుపాత్రులు కావాలని సూచించారు.

## చార్మినార్‌కు చేరుకున్న గో రక్ష మహా పాదయాత్ర


చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరంలో పూజలు నిర్వహిస్తున్న బాలక్రిష్ణ స్వామి

**చార్మినార్,డిసెంబరు 23 ప్రభాతవార్త :** గో రక్షణ,భూ రక్షణ, పర్యావరణ రక్షణ కోసం కాశ్మీర్ నుంచి కన్యా కుమారీ వరకు బాలక్రిష్ణ గురుస్వామి నిర్వహిస్తున్నగో రక్ష మహా పాదయాత్ర అబిడ్స్, మోజాంజాహి మార్కెట్,బేగంబజార్, అఫ్జల్‌గంజ్, నయాపూల్, మదీనా,పత్తర్‌గట్టి,గుల్జారాహౌస్‌ల మీదుగా చారిత్రక చార్మినార్‌కుచేరుకుంది.అనంతరం బాల క్రిష్ణ గురుస్వామి చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరంలో అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.గో రక్ష మహా పాద యాత్రలో బాల క్రిష్ణ గురు స్వామితో ఉన్న గోమాతకు కూడ శ్రీ భాగ్యలక్ష్మి మందిరంలో పూజలు జరిపారు.ఈ సందర్భంగా బాల క్రిష్ణ గురుస్వామి మాట్లాడుతూ గో రక్షణ,భూ రక్షణ,పర్యావరణ రక్షణ కోసం కాశ్మీర్ నుంచి కన్యా కుమారీ వరకు మహా పాదయాత్రను నిర్వహిస్తున్నామని తెలిపారు.బషీర్ బాగ్ నుంచి చార్మినార్ వరకు కొనసాగిన గో రక్షణ మహా పాదయాత్రలో అధిక సంఖ్యలో శ్రీ అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.కాగా నయాపూల్ వద్ద సీనియర్ కాంగ్రెస్ నాయకులు కె.వెంకటేష్ గో రక్షణ మహా పాద యాత్రకు స్వాగతం పలికారు.

## రేవతి కుటుంబానికి అండగా ఉంటాం - తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ

**హైదరాబాద్, డిసెంబరు 23,ప్రభాతవార్త:** సంధ్య థియేటర్ ఘటనలో ఒక పేద ఆర్య వైశ్య కుటుంబానికి చెందిన మహి ళ మృతి చెందడం, ఆమె కుమారుడు విషమ పరిస్థితిలో ఆసుపత్రిలో ఉండడం అత్యంత బాధాకరం అని తెలంగాణ ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారంసోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లక్ష్మీనారాయణ మాటాడుతూ సంధ్య థియేటర్ ఘటనను ఇప్పటికే అసెంబ్లీ వేదికగా ప్రస్తా వించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఆసుపత్రిలో ఉన్న అబ్బాయి పూర్తిగా కోలుకునే వరకు ప్రభుత్వం ఆ కుటుంబానికి అం డగా ఉండాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఆర్య వైశ్య మహా సభ తరపున ఆ కుటుంబానికి ఏ విష యంలో నైనా సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉంన్నారు. ఈ ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ తో పాటు ఆర్గనైజింగ్ సెక్రెటరీ రేణిగుంట్ల గణేష్ గుప్తా, పొలిటికల్ కమిటీ చైర్మన్ చింతల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మత్స్య మిత్ర గ్రూపులను పునరుద్ధరించాలి.. మహిళా సొసైటీకి రూ .10 లక్షల రుణాలు ఇవ్వాలి

**చిక్కడపల్లి, డిసెంబరు 23 ప్రభాతవార్త:** మత్స్య మిత్ర గ్రూపులను పునరుద్ధరించి 10లక్షల రూ,, రుణాలు 100 శాతం సబ్సిడితో ఇవ్వాలని, 50 సంవత్సరాలు నిండిన మత్స్య మహిళలకు వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలి. ఈరోజు తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని షోయబ్ హాల్ లో రాష్ట్ర సహాయ కార్యదర్శి, మత్స్య శాఖ హైదరాబాద్ జిల్లా చైర్మన్ కొప్పు పద్మ గారి అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సు ముఖ్య అతిథిగా అఖిల భారత మత్స్యకారులు మత్స్య కార్మిక సమాఖ్య జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ టిఎంకెఎంకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మా హాజరై మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మత్స్య మహిళలు గత అనేక సంవత్సరాలుగా మహిళా సొసైటీలు ఏర్పాటు చేసుకొని రోడ్ల పైన చేపల అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు దీంతో పాటు గత ప్రభుత్వం నూతన మత్స్య మహిళ సొసైటీలను ఏర్పాటు చేసి గాలికి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఈ ప్రభుత్వమైనా ఏమైనా చేస్తుందేమో అనుకుంటే సొసైటీలో చేసుకున్నప్పటి నుండి ఇప్పటివరకు మత్స్యకార మహిళలకు ఎలాంటి రుణాలు గాని రివాల్వింగ్ ఫండు ఇవ్వకపోవడంతో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందని విమర్శించారు. కావున ఈ ప్రభుత్వమైన మత్స్య మిత్ర గ్రూపులను పునరుద్ధరించి 10లక్షల రూ రుణాలు 100 శాతం సబ్సిడితో ఇవ్వాలని, 50 సం!! రాలు నిండిన మత్స్య మహిళలకు వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలని, చేపల మార్కెట్లలో మహిళలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని మత్స్య మహిళలకు చేపల వంటకాలపై అలంకరణ చేపల ఉత్పత్తి పై ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలి, ప్రతీ జిల్లా కేంద్రంలో హోల్ సేల్, ప్రతీ మండల కేంద్రంలో చేపల మార్కెట్లు నిర్మించాలి, చేపల మార్కెట్ల నిర్వహణ భాధ్యత స్థానిక మత్స్య మహిళా సొసైటీలకు నామ మాత్రపు లీజుకు ఇవ్వాలి,మత్స్య సొసైటీ సభ్యురాలికి ప్రసూతి సమయంలో కనీసం 6 నెలలకు 50 వేల రూ,,ఆర్థిక సహాయం చేయాలి,సహజ మరణం పొందిన మహిళల కుటుంబాలకు రూ మత్స్యకారుల మహిళల సమస్యలపై ఈరోజు జరిగిన మత్స్య మహిళల రాష్ట్ర సదస్సులో తీర్మానం . చేసి మత్స్య మహిళలు హక్కుల కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిలీరీలీరీళీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, హైదరాబాద్ డి ఎఫ్ సి ఎస్ జిల్లా చైర్మెన్ కొప్పు పద్మ, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ గాండ్ల అమరావతి, మేడ్చల్ జిల్లా కన్వీనర్ బక్కి బాలమణి,రంగారెడ్డి జిల్లా కన్వీనర్ కాగు లక్ష్మి, గుడిపల్లి కనకతార, అరుణ, రజమణి, నీరటి అనురాధ, గోరెంకల మాధవి,కర్రెల్లి నవనీత,కంటే శశిరేఖ, దీపిక, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ప్రతినిధులు

## పదవ తరగతి విద్యార్థులకు మోటివేషనల్ శిక్షణ



సుధీర్ సంద్రను సన్మానిస్తున్న దృశ్యం

**నిజాంపేట్, డిసెంబర్ 23, ప్రభాతవార్త**

తెలంగాణ గుర్తింపు పొందిన అపర్డబుల్ స్కూల్స్ అసోసియేషన్ (ట్రపసా) గ్రేటర్ కుత్బుల్లాపూర్, చింతల్‌లోని శ్రీ ఆద్య అకాడమీలు సంయుక్తంగా పదవ తరగతి విద్యార్థులకు మోటివేషనల్ శిక్షణను ఏర్పాటు చేశారు. సోమవారం గాజుల రామారంలోని ఎస్‌జి కన్‌వెన్షన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సుధీర్ సంద్రతో పాటు సూరారంకాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, జీడిమెట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్, మండల విద్యాధికారి జెమిని కుమారిలు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థుల పలు అంశాలపై అవగాహన కల్పించారు. 55 పాఠశాలలకు చెందిన సుమారు 2200 మంది పదవతరగతి విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధీర్ సంద్ర మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితంలో తల్లిదండ్రులు, గురువులు, సైనికులు, రైతులను మాత్రమే నిజమై హీరోలుగా గుర్తించి గౌరవించాలన్నారు. సినిమాలలో నటించే హీరోలను తమ జీవితాలకు ఆదర్శంగా తీసుకోవద్దని సూచించారు. చెడువ్యసనాలకు లోనుకాకుండా ముందుకు వెళ్ళినప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటామని తెలిపారు. మండల విద్యాధికారి జెమిని కుమారి మాట్లాడుతూ పదవతరగతి విద్యారులకు మోటివేషన్ తరగతులు నిర్వహించడం హర్షనీయమని నిర్వాహకులను అభినందించారు. కుత్బుల్లాపూర్‌లో ఉత్తమ ఫలితాలను సాధించి మేడ్చల్ జిల్లాలోనే ఆదర్శవంతంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాక్షులు బీర్ల ఆంజనేయులు, శ్రీ ఆద్య అకాడమీ కరస్పాండెంట్ విశ్వనాథ్ చారి, ట్రపస చైర్మన్ కోల వెంకటేష్, అధ్యక్షులు వినోద్ జాదవ్, ప్రధానకార్యదర్శి దయాకర్, కోశాధికారి శ్రీశైలం, కార్యనిర్వాహక కార్యదర్శి మధుకుమార్ పాల్గొన్నారు.

## అల్లు అర్జున్‌పై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఫిర్యాదు

**ఉప్పల్, డిసెంబరు 23 ప్రభాతవార్త :** పుష్ప -2 సినిమాలో పోలీసులను కించపరిచే విధంగా స్విమ్మింగ్‌పూల్‌లో మూత్ర విసర్జన చేసే సీన్ చిత్రీకరించిన డైరెక్టర్ సుకుమార్, హీరో అల్లు అర్జున్, నిర్మాతలపై తగు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సోమవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు అధికారుల మనోభావాలు దెబ్బతీసే విధంగా చిత్రంలో సన్నివేశాలు చిత్రీకరించారని, స్విమ్మింగ్‌పూల్‌లో పోలీస్ అధికారి ఉండగా మూత్ర విసర్జన చేసినట్లు సీన్ చేశారని పేర్కొన్నారు. అల్లు అర్జున్, డైరెక్టర్ సుకుమార్‌పై తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి ఫిర్యాదు స్వీకరించారు. దీనిపై తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయిస్తున్న ఒక వ్యక్తి అరెస్ట్

**ఉప్పల్, డిసెంబరు 23 ప్రభాతవార్త :**

గంజాయి విక్రయిస్తున్న ఒక వ్యక్తిని ఉప్పల్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సిఐ ఎలక్షన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రం బొమిక గజపతి ప్రాంతానికి చెందిన భారత్ అలయన్న (55) నారపల్లి మసీదు ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. అయితే ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి తెచ్చి విక్రయాలు చేస్తున్నాడని తెలిపారు. అదే ప్రాంతానికి చెందిన బసంత్ పోరిచా అనే వ్యక్తితో కలిసి గంజాయి విక్రయాలు చేస్తున్నట్లు తెలిపారు.. నిందితుడు పుట్టుకతో వికలాంగుడు కావడంతో ఎవరికి అనుమానం రాకుండా ప్రతి ఆదివారం నారపల్లిలో జరిగే మార్కెట్‌లో తిరుగుతూ వ్యాపారం చేస్తున్నాడని, నిందితుడు, అతని భార్య పద్మపై ఖమ్మంలో కేసు ఉందని, నగరంలోని మంగళ్‌హాట్ పిఎస్ పరిధిలో కూడా ఇదే దందా అరెస్ట్ అయినట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 6 కిలోల గంజాయి, ఒక సెల్‌ఫోన్, రూ.14వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రాష్ట్రంలో ఆరోగ్య మిత్రాలకు ఇచ్చిన హామీలను అమలుకు కృషి

-రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా

**చిక్కడపల్లి, డిసెంబరు 23 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఆరోగ్య మిత్రాలకు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవర్చేదానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. సోమవారం ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదయ్య నేతృత్వంలో ప్రతినిధి బృందం మంత్రి దామోదర రాజనర్సింహాను కలిసి సమస్యలతో కూడినవినతిపత్రాన్ని సమర్పించింది. రాష్ట్రంలో ఆరోగ్య మిత్రాలకు ఇచ్చిన హామీ డాటా ఎంట్రీ ఆపరేటర్ క్యాడర్ను అమలు చేయాలని వినతి పత్రం సమర్పించింది. అందుకు మంత్రి స్పందిస్తూ ఆరోగ్య మిత్రాలు ఎవరు కూడా అధైర్య పడవలసిన అవసరం లేదు, అతి త్వరలో మీకు డాటా ఎంట్రీ ఆపరేటర్ క్యాడర్ తో పాటు పెరిగిన జీతం తప్పకుండా వస్తుందని హామీ ఇచ్చినట్లు గిరి యాదయ్య వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కుమార్, ఉపాధ్యక్షులు సుమన్, జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, రత్నం, నాగరాజ్,అనిల్, రవీందర్, శ్రీనివాస్, కురుమయ్య, నగేష్,రవీందర్, లింగస్వామి, అనుజ, ప్రమీల, సునీత, తదితరులు పాల్గొన్నారు.

## అల్విన్‌కాలనీలో ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు


అల్విన్ కాలనీలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న రామస్వామి, శ్రీదేవి, ప్రియాంక, అంజనీదేవి, లక్ష్మీ, వరలక్ష్మీ తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 23, ప్రభాతవార్త:**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా అల్విన్‌కాలనీలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆకట్టుకున్న ఈ ముగ్గుల పోటీలతో అప్పుడే సంక్రాంతి వేడుకలను గుర్తుచేశాయి. ప్రముఖ సంఘసేవకుడు, జిహెచ్ఎంసి రిటైర్డు అధికారి రామస్వామి ఆధ్వర్యంలో మియాపూర్, ఇంద్రారెడ్డి కాలనీ, అల్విన్‌కాలనీలోని పీజేఆర్ పార్కులో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక కాలనీ మహిళలు, విద్యార్థినులు పాల్గొని రంగు రంగుల ముగ్గులతో తమ ప్రతిభను కనబరిచారు. ఈ ముగ్గుల పోటీలలో గెలుపొందిన మహిళలకు రామస్వామితో పాటు యూసుఫ్‌లు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముత్తోజు శ్రీదేవి, ముత్తోజు ప్రియాంక, అంజలీదేవి, వరలక్ష్మీ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి రిటైర్డు అధికారి రామస్వామి మాట్లాడుతూ ప్రతి ఏటా తమ కాలనీలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

## వచ్చే నెల 11న 'ఫణిగిరి బుద్ధిస్ట్ ఆర్ట్ ప్రదర్శన



**హైదరాబాద్, డిసెంబరు 23 ప్రభాతవార్త**

ప్రముఖ చిత్రాకారుడు,కార్టునిస్ట్ శిరంశెట్టి ఆనంద్ సేకరించిన 'ఫణిగిరి బుద్దిస్ట్ సైట్ ఆర్ట్' ప్రదర్శన జనవరి 11 నుండి 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. మాధాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో పణిగిరి బుద్దిస్ట్ సైట్‌కు చెందిన 100 చిత్రాలతో ఆర్ట్ ప్రదర్శన, పుస్తకావిష్కరణ కార్యక్రమాలు కొనసాగుతాయని ఆనంద్ తెలిపారు. ఫణిగిరి కొండపైన తవ్వకాల్లో బయటపడిన బుద్ధిడి జాతక కథల, అందమైన శిల్పాలు ఈ ప్రదర్శనలో చోటుచేసుకోనున్నాయి. సూర్యాపేట జిల్లా, నాగారం మండలం, ఫణిగిరి గ్రామ పరిధిలో జరిగిన తవ్వకాల్లో రెండువేల సంవత్సరాల క్రితం నాటి బుద్ధ క్షేత్రం బయటపడిన విషయం తెలిసిందే.

## కెఎస్‌జీ బాస్కెట్‌బాల్ విజేత ఫ్యూచర్ కిడ్స్



గెలుపొందిన విజేతలు ట్రోఫీ అందజేస్తున్న అభిషేక్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 23,ప్రభాతవార్త:**

కేఎస్‌జీ వర్సిటీ బాస్కెట్‌బాల్ లీగ్ బాలికల విభాగంలో ఫ్యూచర్ కిడ్స్, బాలుర విభాగంలో ఒక్రిడ్జ్ జట్లు టైటిళ్లు సాధించాయి. సోమవారం మాదాపూర్‌లోని డీబీపి బాస్కెట్ బాల్ ప్రాంగణంలో జరిగిన ఈ పోటీల్లో బాలికల ఫైనల్లో ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ 4628తో డీపీఎస్ హైదరాబాద్‌పై నెగ్గగా, బాలుర ఫైనల్లో ఒక్రిడ్జ్ గచ్చిబౌలి జట్టు 8065తో చిరెక్ కొండాపూర్ జట్టుపై గెలిచింది. ముగింపు వేడుకల్లో పాల్గొన్న కంకణాల స్పోర్ట్స్ గ్రూప్ ప్రమోటర్ అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే ప్రతిభావంతులైన బాస్కెట్‌బాల్ క్రీడాకారులను గుర్తించి వారిని అంతర్జాతీయ ప్రమాణాలకు తగిన విధంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ కేఎస్‌జీ వర్సిటీ బాస్కెట్‌బాల్ లీగ్‌ను ప్రారంభించామని వెల్లడించా రు. ఈ లీగ్‌లో 55 పాఠశాలల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు ఈ పాల్గొన్నారని అభిషేక్ రెడ్డి తెలిపారు. అనంతరం అభిషేక్ రెడ్డి విజేత జట్లకు ట్రోఫీలు ప్రదానం చేశారు.

## సిపిఐ శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి



**తుర్కయంజాల్ డిసెంబరు 23 ప్రభాతవార్త**

సిపిఐ శత జయంతి ఉత్సవాల గోడపత్రికను సోమవారం తుర్కాయాంజల్ చౌరస్తాలో జిల్లా కౌన్సిల్ సభ్యులు పి శివకుమార్ గౌడ్ అధ్యక్షతన విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ... సిపిఐ 1926 డిసెంబర్ 26 న ఆవిర్భవించి అనేక పోరాటాలు చేసిందన్నారు. భారత స్వాతంత్రోద్యమం లో పాల్గొని ఎంతో మంది ప్రాణ త్యాగలు చేసి దేశ స్వాతంత్రం కోసం అలుపెరుగని పోరాటాలు చేసిందని అన్నారు. రాష్ట్ర ఏర్పాటు కచ్చితంగా జరగాలని నిరంతరం పోరాటం చేసిందని అన్నారు. సాధించుకున్న తెలంగాణ లో ప్రజల సమస్య ల పరిష్కారం కోసం సిపిఐ నాటి నుండి నేటి వరకు అనేక ఉద్యమాలు చేస్తుందని తెలిపారు. ఈ తరుణం లోనే సిపిఐ శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని ప్రజలందరికి ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు పల్లపు శివకుమార్, పిల్లి కృష్ణ, బ్రహ్మయ్య, శ్రీను గౌడ్, చెక్క యాదగిరి, కొట్యా నాయక్, భాస్కర్, శ్రీను, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్,గండికోట శివ, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం. డిసెంబరు. 23. ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్లోని భవానీ ఎనక్లేవ్ కాలనీలో నూతనంగా నిర్మించనున్న శ్రీ సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి జి.ఎచ్.ఎం. సి. డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తో కలిసి సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని ,శుఖ సంతోషాలతో జీవించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెట్టుపల్లి సంతోష్ రెడ్డి,కాలనీ ప్రతినిధులు నర్సి రెడ్డి, తిరుమలేష్,రమేష్,ఆలయ కమిటీ అధ్యక్షురాలు స్పందన,నాయకులు పవన్ రెడ్డి ,కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

-ఉప విద్యాశాఖాధికారి రాధాకృష్ణ



సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తున్న పాఠశాల విద్యార్థులు

**మలక్ పేట డిసెంబరు 23, ప్రభాతవార్త:**

విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సైదాబాద్ మండలం ఉప విద్యాశాఖ అధికారి తిరునగరి రాధాకృష్ణ పేర్కొన్నారు. మలక్ పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని తెలిపారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి కృషి చేయాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సంస్కృతి కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సయ్యద్ మీనాజుద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ, డిప్యూటీ ఐఓఎస్ లు వరప్రసాద్ రెడ్డి, అస్రా ఫాతిమా, శ్రీనివాస్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### బచ్ పన్ స్కూల్ లో ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



బచ్ పన్ స్కూల్ లో వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

**వనస్థలిపురం డిసెంబరు23,ప్రభాతవార్త :** వనస్థలిపురంలో గల బచ్ పన్,అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ లో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన లో విద్యార్థులు తయారుచేసిన పలు నమూనాలు ప్రదర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్కూల్ రీజనల్ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి వైజ్ఞానిక ప్రదర్శన లో విద్యార్థులు తయారుచేసిన పలు నమూనాలను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న ప్రతిభను వైజ్ఞానిక ప్రదర్శన ల ద్వారా వెలికితీయవచ్చన్నారు.మేధా శక్తిని పెంపొందించుకునేందుకు తోడ్పతాయన్నారు.ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సునీతా శ్రీనివాస్, ప్రిన్సిపాల్ కల్పవల్లి,విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి రెండు దరఖాస్తులు




దరఖాస్తులు పరిశీలిస్తున్న డిసి సుజాత

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 23 ప్రభాతవార్త:** సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రెండు దరఖాస్తులు అందినట్లు సరూర్‌నగర్ ఉపకమిషనర్ సుజాత తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.00 వరకు సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో ఉపకమిషనర్ ఏ.సుజాత ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన సమస్యలపై రెండు దరఖాస్తులు వచ్చినట్లు సుజాత తెలిపారు.

## వైభవంగా స్వయంభు కాలబైరవ స్వామి ఆలయం ఉత్సవాలు



శ్రీ కాలబైరవస్వామి ఉత్సవాల్లో పాల్గొన్న హెచ్ఎండిఏ మాజీ కమిషనర్ చిరంజీవులు, తహసీల్దార్ వాణిరెడ్డి, గ్రామ పెద్దలు



శ్రీ కాలబైరవ స్వామి ఉత్సవాల సందర్భంగా శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం.

**ఉప్పల్, డిసెంబరు 21 ప్రభాతవార్త :**

ఉప్పల్ భగాయత్‌లోని కొలువదీరిన శ్రీస్వయంభు కాలబైరవ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా సాగుతున్న ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, అభిషేకం, అష్టకాల భైరవ వావనం, బలిప్రధానం, పూర్ణాహుతి, ప్రధాన కళష సంప్రోక్షణ, శివపార్వతి కల్యాణం, బ్రహ్మణ ఆశీర్వచనము, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పూజ కార్యక్రమానికి హెచ్ఎండిఏ మాజీ కమిషనర్ చిరంజీవులు, తహసీల్దార్ వాణిరెడ్డి, ఉప్పల్ గ్రామ పెద్దలు మేకల శివారెడ్డి, సల్ల రాజిరెడ్డి,గోనె అర్జున్‌రెడ్డి, శామీర్‌పేట ధర్మారెడ్డి, మేకల మధుసూధన్‌రెడ్డి, చింతల నరసింహారెడ్డి, అన్య బాలకృష్ణ, బంగ్లా శ్రీనివాస్‌రెడ్డి, దేవాలయ అర్చకులు గంటంబోట్ల వెంకటరమణ శర్మ, నిడుమోలు రామకృష్ణశర్మ, కట్టమైసమ్మ ఆలయ పండితులు సుమన్‌శర్మ ఆలయ కమిటి నేతలు కంచెమీది శివయ్య, పూజల లక్ష్మణ్, ఈగ సంతోష్, శామీర్‌పేట వినోద్‌రెడ్డి, ఉపేందర్ తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. త్వరలోనే ఆలయ నిర్మాణం చేపట్టేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చారని, కమిటి సమావేశం ఏర్పాటు చేసి తుది నిర్ణయం తీసుకుంటామని వారు తెలిపారు. అనంతరం సాయంత్రం శ్రీ గణపతి అరాధన, స్వామి వారి పల్లకి సేవ, మహా జ్వాలా తోరణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు,భక్తులు పాల్గొన్నారు.

**తెలుగు బుక్ అఫ్ రికార్డులోకి కాల బైరవ ఆలయం :** ఉప్పల్‌లోని శ్రీ స్వయంభు కాల బైరవ ఆలయం తెలుగు బుక్ ఆఫ్ రికార్డులోకి ఎక్కినట్లు ఆలయ కమిటి నేతలు తెలిపారు. సుమారు 500 సంవత్సరాల క్రితమే ఆలయం ఉన్నట్లు పురావస్తుశాఖ గుర్తించిందని తెలిపారు. ఆలయానికి తగు సర్టిపికేట్ జారీ చేశారని తెలిపారు.

## ప్రజల సమస్యలే మా మొదటి ఎజెండా

-చైర్‌పర్సన్ మల్ రెడ్డి అనురాధ రామ్ రెడ్డి

**తుర్కయంజాల్ డిసెంబర్ 23,ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ 18వ వార్డు, 19వ వార్డు, 22వ వార్డు పరిధిలో 4 కోట్ల 9 లక్షల అభివృద్ధి పనులను సోమవారం మున్సిపాలిటీ చైర్ పర్సన్ మల్ రెడ్డి అనురాధ రామిరెడ్డి, వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్ లు కౌన్సిలర్లు సునీల్, నారని కవిత శేఖర్ గౌడ్,కే ఐలయ్య, నాయకులతో కలిసి అండర్ సీసీ రోడ్లు , అండర్ డ్రైనేజ్ పనులకు శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ అనురాధ రామ్ రెడ్డి మాట్లాడుతూ... ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, తెలంగాణ రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి, సహకారంతో ఎలాంటి సమస్యలు ఉన్న తుర్కయంజాల్ మున్సిపాలిటీ 24 వార్డులు మొత్తానికి అభివృద్ధి చేస్తామని మాట ఇచ్చారు. అదేవిధంగా వివిధ వార్డులో మౌలిక వసతులు సిసి రోడ్లు, అండర్ డ్రైనేజ్, ఇంటింటికి మంచినీళ్లు, విద్యుత్ వీధిలైట్లు, కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధ్యక్షురాలు కౌన్సిలర్ కొత్త



కుర్మా మంగమ్మ శివకుమార్, కౌన్సిలర్లు నక్క శివలింగం గౌడ్, బొక్క రవీందర్ రెడ్డి, కొండ్రు మల్లేష్,కుంట ఉదయశ్రీ గోపాల్ రెడ్డి, మర్రి మాధవి మహేందర్ రెడ్డి,దూదిమెట్ల వెంకటేష్ యాదవ్, వేముల శంకర్, హనుమంత్ గౌడ్, నరసింహ, పెద్దయ్య, శేఖర్ యాదవ్, డాక్టర్ రాగ్యా నాయక్, శంకర్ నాయక్, మాజీ వార్డ్ నెంబర్ రాజు నాయక్, సాయి ప్రియ కాలనీ అధ్యక్షుడు కృష్ణ, సత్యనారాయణ, వెంకట్రావు, శ్రీనివాస్ రెడ్డి,బాయ్ ముత్కల శీను, ప్రవీణ్, పల్లె రాజు, ప్లంబర్ కృష్ణ, భాస్కర్ రెడ్డి, సభావాట్ శంకర్ నాయక్, శేఖర్ రెడ్డి, బోరో నాయక్, రాములు, అశోక్, భాస్కర్, ఎండి షఫీ, నాగరాజు, ఉపేందర్,పాల్గొన్నారు.

## గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలి : బాలకృష్ణ

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 23 ప్రభాతవార్త:** నేడు హనుమాన్ యువసేన ఆధ్వర్యంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు గోవుని కాపాడండి గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలంటూ బాలకృష్ణ గురుస్వామి గత మూడు నెలల నుండి కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు గోమాతను కాపాడాలంటూ పాదయాత్ర నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు ఆయన 9 రాష్ట్రాలు తిరుగుతూ సోమవారం హైదరాబాద్ నగరంలోని కొత్తపేట ఓమ్ని ఆసుపత్రి సమీపంలో ఉన్న భవానిమాత దేవాలయం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా హనుమాన్ యువసేన అధ్యక్షులు బోల్గం యశ్వాల్‌గౌడ్ ఆధ్వర్యంలో పూలమాల వేసి శాలువాలతో సత్కరించి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాలకృష్ణ గురుస్వామి మాట్లాడుతూ గోమాతను కాపాడాలని, ఇవాళ మనం గోమాత పేడతో పిడకలు, ఇంట్లో యజ్ఞం చేసుకోవాలన్న పిడకలు కావాలి అదేవిధంగా ఆవు నెయ్యి కావాలి, ఆవుకి ఎంత ప్రత్యేకత ఉందో అర్థం చేసుకోవాలన్నారు. పూజా సమయంలో అబిషేకం చేయాలి అంటే ఆవుపాలు కావాలి ఇంతకు ఆవులేనిది మరి మన ఇళ్లల్లో శుభకార్యం జరగదు అన్నారు. ఇలాంటి



బాలకృష్ణ గురుస్వామిని సన్మానిస్తున్న బోల్గం యశ్వాల్‌గౌడ్

గొప్ప గుణాలు ఉన్న ఆవుని కాపాడుకుందాం దేశి ఆవుని కాపాడుకుందాం దేశి ఆవుపాలు తాగండి దేశి ఆవునెయ్యి తినండి ఆరోగ్యంగా ఉండాలన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ యువసేన అధ్యక్షులు బోల్గం యశ్వాల్‌గౌడ్, భవానిమాత దేవాలయం చైర్మన్ రుషి, అఖిల్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజేందర్, భాస్కర్, కిరణ్‌కుమార్, వినోద్, తరుణ్‌సింగ్‌ఠాగూర్, అవినాష్, వరుణ్, వేణు, సంప్రీత్, యశ్వంత్, విష్ణు, మల్లికార్జున్ వందలాదిగా హిందూ బంధువులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి : జోనల్ కమిషనర్ వెంకన్న

**మలక్ పేట, డిసెంబరు 23, ప్రభాతవార్త:** స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీ హెచ్ యం సీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న సూచించారు. జోనల్ కమిషనర్ వెంకన్న పర్యవేక్షణలో సోమవారం జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో చార్మినార్ సర్కిల్ పరిధిలోని అలీజా కోట్ల ప్రాంతంలో అక్రమ నిర్మాణం సమస్యపై ఒక్క ఫిర్యాదు అందింది. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ...ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో తమకు అందిన ఫిర్యాదులను సంబంధిత విభాగాలచే పరిష్కరిస్తున్నామన్నారు.బస్తీ, కాలనీ వాసులు స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఫిర్యా




ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అధికారులు

దు చేయాలని అయన సూచించారు.ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ శైలజ, ఎస్ ఈ మహేశ్వర్ రెడ్డి,యుబిడి డిప్యూటీ డైరెక్టర్ అమీనా బీ, టౌన్ ప్లానింగ్ సిపి ఎంఎ మాజీద్, ఏ యం సీ రాజారావు, సీనియర్ అసిస్టెంట్ హమీద్, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## హామీలను నెరవేర్చకుండా ప్రజలను పక్కదారి పట్టిస్తున్న రేవంత్ సర్కార్ : సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబరు 23 ప్రభాతవార్త:**

కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను పక్కదారి పట్టిస్తూ రాష్ట్రాన్ని అధోగతి పాలుచేస్తున్నారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి ధ్వజమెత్తారు. గత బిఆర్ఎస్ పాలనలో నాటి సిఎం కెసిఆర్ సహకారంతో మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్లలో ప్రజల తాగు నీటి సమస్యలను తీర్చడానికి నిర్మించిన మిషన్ భగీరథ భారీ వాటర్ ట్యాంకులను ఆమె పరిశీలించారు. సోమవారం ఉదయం ఆమె రెండు కార్పొరేషన్లలో జలమండలి, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, స్థానిక బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులతో కలిసి పర్యటించి మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిఆర్ఎస్ పాలనలో ఇంటింటికి మంచి నీరు అందించిన ఘనత కెసిఆర్‌కే దక్కుతుందని అన్నారు. ప్రతి ఇంటికి తాగు నీటిని అందించే వరకు ఓట్లు అడగని ప్రకటించిన కెసిఆర్ హామీని నిలబెట్టుకొని భగీరథ ట్యాంకుల ద్వారా ఇంటింటికి మంచి నీటిని సరఫరా చేయించారని ఆమె గుర్తుచేశారు. అయితే నేటి కాంగ్రెస్ పాలనలో అందుకు పూర్తి విరుద్ధంగా జరుగుతున్నదనీ గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేస్తున్నదని ఆమె విమర్శించారు.కాగా బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లలో ప్రజలకు మంచి నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, మీర్‌పేట్ కమిషనర్ ఆర్. జ్ఞానేశ్వర్, డిఇఇలు జ్యోతిరెడ్డి, వెంకన్న, ఎఇఇ శ్రీనివాసు



బిఆర్ఎస్ పాలనలో నిర్మించిన మిషన్ భగీరథ ట్యాంకులను పరిశీలించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

లు, మీర్‌పేట్ మేయర్ ముదావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, రెండు కార్పొరేషన్లకు చెందిన పలువురు బిఆర్ఎ స్ కార్పొరేటర్లు, పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, అర్కల కామేష్‌రెడ్డిలతో పాటు పలువురు నాయకులు, పాల్గొన్నారు.

**లెనిన్‌నగర్‌లో పేదల కోసం ఫంక్షన్ హాల్: సబితా ఇంద్రారెడ్డి**

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని వీకర్ సెక్షన్ కాలనీలో కేంద్రమైన లెనినగర్‌లో పేదలకు సంబంధించి వివాహాది శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలు జరుపుకోవడానికి నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్ ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని స్థానిక మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం ఆమె మీర్‌పేట్ కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, పలువురు అధికారులు, కార్పొరేటర్లతో కలిసి నిర్మాణంలో ఉన్న ఫంక్షన్ హాల్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## టెన్త్ విద్యార్థులుప్రణాళికా బద్ధంగా చదివితే ఉత్తమఫలితాలు

: మోటివేషనల్ వక్త వేణుకళ్యాణ్

**నాచారం, డిసెంబర్ 22 ప్రభాతవార్త** పదవ తరగతి విద్యార్థులుప్రణాళికా బద్ధంగా చదివితే ఉత్తమఫలితాలు సాధించవచ్చని మోటివేషనల్ వక్త వేణుకళ్యాణ్ సూచించారు.రానున్న టెన్త్ పరీక్షలను నిండైన ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని ఉత్తమ ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు. మల్లాపూర్ లోని వివిఎస్ఆర్ హాల్లో కెరీర్ పాయింట్(ఐఐటి,నీట్),న్యూచైతన్య జూనియర్ కళాశాల సంయుక్తగా ఏర్పాటు చేసిన ఎస్సెస్సీ విద్యార్థుల ఓరియెంటేషన్ కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. టెన్త్ పరీక్షలనగానే భయపడొద్దన్నారు. పరీక్షలను కష్టంగా భావించవద్దని, పాఠ్యపుస్తకాలను ఇష్టంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని హితవు పలికారు. ప్రతిరోజు ప్రణాళికా బద్ధంగా చదివితే తప్ప కుండా విజయం సాధిస్తారని భరోసా ఇచ్చారు. దాంతోపాటు విద్యార్థులకు నైతిక విలువలపై కూడా వేణు కల్యాణ్ హితబోధ చేశారు. విద్యార్థులు యుక్త వయస్సులో విద్యార్థినుల వెంటపడ కుండా చదువులో కెరీర్‌లో అగ్రస్థాయికి చేరుకుని వారే తమకోసం క్యూలైన్లలో నిలబడేలా చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు, గురువులను ఎంతగా ఆరాధిస్తే జీవితంలో అంతగా శిఖరాగ్రానికి చేరుకుంటారన్నారు.ఈకార్యక్రమంలో కెరియర్ పాయింట్, న్యూ చైతన్య గ్రూప్ ఆఫ్ కాలేజస్ చైర్మన్ డా. ఉదయ భాస్కర్ రావు, డైరెక్టర్ డా. ప్రదీప్ తాటా, డైరెక్టర్లు శ్యామ్ గౌడ్, అనిల్ కుమార్, మౌనిక తోట, అకాడమిక్ ప్రిన్సిపల్ కట్ట సురెందర్‌తో పాటు వివిద పాఠశాలల నుంచి వందలాది మంది టెన్త్ విద్యార్థులు పాలుపంచు కున్నారు.

### 30న హోమియోపతి వైద్య కళాశాల వార్షికోత్సవం



రాష్ట్ర వైద్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహాకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న డా.లింగరాజు తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 23 ప్రభాతవార్త :**

రామంతాపూర్‌లోని జయసూర్య పొట్టి శ్రీరాములు హోమియోపతి వైద్య కళాశాల 57వ వార్షికోత్సవం ఈనెల 30వ తేదిన సాయంత్రం ఐదు గంటలకు నిర్వహిస్తున్నట్లు హోమియోపతి కళాశాల అడిషనల్ డైరెక్టర్, కళాశాల ప్రిన్సిపల్ డా.లింగరాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహా, స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిలను పలువురు విద్యార్థులు, ప్రొఫెసర్లతో కలిసి ఆహ్వానించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డా.లింగరాజు మాట్లాడుతూ హోమియోపతి వైద్య కళాశాలలో జరిగే వార్షికోత్సవ వేడుకలకు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరవుతున్నారని తెలిపారు. విద్యార్థులచే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వినియోగదారుల హక్కుల దినోత్సవం



వినియోగదారుల హక్కుల దినోత్సవంలో పాల్గొన్న డా.విజయ్‌కుమార్ తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 23 ప్రభాతవార్త :** ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం వినియోగదారుల హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డా.కె.విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వాణిజ్య శాస్త్ర విభాగం సహా అచార్యులు డా.చిందం సత్యనారాయణ సయన్వయం చేశారు. ప్రభుత్వ సిటి కళాశాల వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు డా.ఎస్.రూన్సీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆన్‌లైన్ క్రయ విక్రయాలు ఊపందుకున్న ఈ కాలంలో వినియోగదారులు మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వినియోగదారుల హక్కుల బాధ్యతలు అనే అంశంపై ఉపన్యాసం చేశారు. హక్కులపై అవగాహనతో మోసాలను ఎదుర్కొన్న సంఘటలను వివరించారు. ఈ సందర్భంగా వినియోగదారుల హక్కులపై జరిగిన వ్యాసరచన, ఉపన్యాసం పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.ఎ.రవిప్రసాద్, అకాడమిక్ కోఆర్డినేటర్ కె.గీత, ఎన్ఎస్ఎస్ పిఒ జె.విశ్వనాద్‌కుమార్, డా.ఎన్.రాజశ్రీ, డా.వి.చంద్రకళ, డా.జి.తిరుతపయ్య, డా.వి.శ్రీనివాసరావు, డా.ఆర్. చంద్రసాగర్, పి.ధనలక్ష్మి, జి.శ్రీదేవి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, వినాయోగదారుల క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

### ఉప్పల్ మల్లికార్జునస్వామి ఆలయ కమిటి కార్యవర్గం ఎన్నిక

**ఉప్పల్, డిసెంబరు 23 ప్రభాతవార్త :** ఉప్పల్ మల్లికార్జుననగర్ కాలనీలో నిర్మించతలపెట్టిన శ్రీ భ్రమరాంభిక మల్లికార్జునస్వామి ఆలయ కమిటి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటి చైర్మన్‌గా పి.నగేష్, వైస్ చైర్మన్‌గా రంగారెడ్డి, కార్యదర్శిగా సత్తిరెడ్డి, గాలయ్య, కోశధికారిగా సంతోష్, ప్రణయ్, కార్యవర్గ సభ్యులుగా నారాయణరెడ్డి, నాగేశ్వర్‌రావు, ఓబుల్‌రెడ్డి, గోపినాయక్, చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, దీపక్‌లను ఎన్నుకున్నట్లు కమిటి నేతలు తెలిపారు. కాలనీలో శ్రీ భ్రమరాంభిక మల్లికార్జునస్వామి ఆలయాన్ని నిర్మించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## కాంగ్రెస్‌లో చప్పిడి రాజిరెడ్డి చేరిక



కెఎల్ఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన చప్పిడి రాజిరెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబరు 23 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడకు చెందిన సీనియర్ నాయకుడు, కాంటెస్టెడ్ కార్పొరేటర్ చప్పిడి రాజిరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. గత కొన్ని సంవత్సరాలుగా రాజకీయాల్లో స్తబ్దుగా ఉన్న ఆయన ఎట్టకేలకు క్రియాశీలకంగా పని చేయాలని నిర్ణయించి కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన తుక్కుగూడలోని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం కెఎల్ఆర్ క్యాంపు ఆఫీస్‌లో పార్టీలో చేశారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి రాజిరెడ్డికి మూడు రంగుల కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించి అభినందించారు.

### విజయం సాధించాలంటే లక్ష్యసాధన ఎంతో అవసరం : శివసేనా రెడ్డి



**తార్నాక,డిసెంబర్ 23 ప్రభాతవార్త :** పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని స్పోర్ట్‌జైట్ ఎలాజెన్ 2024 పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిద రకాల ఆటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కల్నల్ అనిల్ కుమార్, నేషనల్ బ్యాట్మెంటన్ ప్లేయర్ చేతన్ ఆనంద్, ఇండియన్ మౌంటెనీర్ మలావత్ పూర్ణ, పల్లవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ సంస్థ చైర్మన్, వైస్ చైర్మన్ ఆఫ్ డీపీఎస్ స్కూల్స్ అధినేత మల్కా కొమరయ్య, డైరెక్టర్ సుశీల్ కుమార్, అకాడమిక్ డైరెక్టర్ సుధ, డీపీఎస్, పీజీఓఎస్ సీఈవో మల్కా యశస్వి, బాచుపల్లి ప్రిన్సిపల్ అనురాధమూర్తి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ, విజయం సాధించాలంటే లక్ష్యసాధన ఎంతో అవసరమని ఆటలు ఆడే వారిలో నాయకత్వ లక్షణాలతో పాటు బాధ్యత, నిజాయితీ, సమదృష్టి భావన ఉండాలన్నారు. నేషనల్ బ్యాట్మెంటన్ ప్లేయర్ చేతన్ ఆనంద్ మాట్లాడుతూ క్రీడలు అంటే కేవలం ఆటలే కాదని విజయానికి తొలిమెట్టు అన్నారు. విద్యార్థులు వారు ఎంచుకున్న లక్ష్యంపై దృష్టిని సారించి విజయానికి కృషి చేయాలని తెలియజేశారు. సంస్థ చైర్మన్ కొమరయ్య మాట్లాడుతూ పల్లవిలోని విద్యార్థులకు చదువుతో పాటు ఆటపాటలలో కూడా తగిన శిక్షణ ఇవ్వటం వలన వారి విజయం సాధించడానికి సహాయ సహకారాలు పల్లవి గ్రూప్ స్కూల్స్ అందిస్తాయన్నారు. అకాడమిక్ డైరెక్టర్ సుధ, ప్రిన్సిపల్ అనురాధ మూర్తి ఆధ్వర్యంలో విజేతలుగా నిలిచిన విద్యార్థిని విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బృందం పాల్గొనటం జరిగింది.

### రైతు దంపతులకు పుడమి పుత్ర పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న ఉత్తమ రైతు దంపతులు ఉషారాణి, శ్రీనివాసరావు

**సరూర్‌నగర్, డిసెంబరు 23 ప్రభాతవార్త:** సేంద్రీయ వ్యవసాయం ద్వారా పంటలను పండిస్తూ రైతాంగంలో, ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్న బాలాపూర్ మండలం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ నివాసులైన రంగారెడ్డి జిల్లా యాచారం మండలం గడ్డమల్లయ్యగూడ జెకెఆర్ ఫామ్ ఎస్టేట్ రైతు దంపతులు జాటోతు ఉషారాణి, శ్రీనివాసరావులకు పుడమి పుత్ర పురస్కారాలు లభించాయి. గత నాలుగు దశాబ్దాలుగా ఉన్న సిల్వర్ డ్రాప్స్ విద్యా సంస్థలను నిర్వహిస్తున్న శ్రీనివాసరావు గత కొన్ని సంవత్సరాలుగా గడ్డమల్లయ్యగూడలో తన కుటుంబంతో కలిసి మక్కువతో సేంద్రీయ వ్యవసాయం చేస్తూ అక్కడ పండించిన ఆహార ఉత్పత్తులను జిల్లెలగూడలోని స్టాల్ ద్వారా సరసమైన ధరలకు ప్రజలకు అందజేస్తూ మంచి పేరు తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఉషారాణి, శ్రీనివాసరావుల కృషిని గమనించిన గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ వీరిని పుడమి పుత్ర పురస్కారాలకు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆదివారం యాదాద్రి జిల్లా యాదగిరిగుట్టలో జరిగిన జాతీయ ఉత్తమ రైతు అవార్డుల ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్న కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ కన్వీనర్ పావనీ రెడ్డి చేతుల మీదుగా ఉషారాణి, శ్రీనివాసరావు దంపతులు పురస్కారాన్ని అందుకున్నారు.

### బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో ఆక్రమణలపై హైడ్రా ప్రాథమిక విచారణ



ఫిర్యాదుదారుడు వెంకట్‌రెడ్డితో కలిసి అక్రమణలను పరిశీలిస్తున్న హైడ్రా అధికారి

**సరూర్‌నగర్, డిసెంబరు 23 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పలు లేఔట్లలో ఓపెన్ స్థలాలు, పార్కు స్థలాల ఆక్రమణలపై సోమవారం హైడ్రా ప్రాథమిక విచారణ జరిపింది. ఇటీవల కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి వివిధ ప్రాంతాల్లో లేఔట్లలో ప్రజోపయోగార్థం వెంచర్లు చేసిన వారు వదిలిని ఖాళీ స్థలాల కబ్జాలపై కార్పొరేషన్ కమీషనర్, టిపిఓ, మేయర్ కు ఫిర్యాదు చేశారు. అయితే వారి నుండి ఎలాంటి స్పందన లేకపోవడం అసహనానికి గురైన వెంకట్‌రెడ్డి ఇటీవల హైడ్రాను ఆశ్రయించి కమీషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ప్రాథమిక విచారణకు వచ్చిన హైడ్రా అధికారి సోమవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్ టిపిఓ అందుబాటులో లేకపోవడంతో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లతో కలిసి ఫిర్యాదుదారుడైన చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి సమక్షంలో విచారణ జరిపారు. ఈ మేరకు సదరు అధికారి ఫిర్యాదుదారుడు పేర్కొన్న కబ్జా ప్రాంతాలను పరిశీలించారు. అయితే నివేదిక తదుపరి చర్యలు ఉంటాయని వెల్లడించారు.

### మినీ క్రిస్మస్ వేడుకలు, గాయత్రీ పాఠశాల వార్షికోత్సవం



వార్షికోత్సవం, క్రిస మ్‌స్ వేడుకల్లో ప్రసంగిస్తున్న మేయర్

**సరూర్‌నగర్, డిసెంబరు 23 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 23వ డివిజన్‌లోనున్న ప్రజాభవన్‌లో బడంగ్‌పేట్ శ్రీ గాయత్రి స్కూల్ వార్షికోత్సవం, క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ముందుస్తు క్రిస్మస్ కేకును కట్ చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 20వ డివిజన్ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, 23వ డివిజన్ నాయకుడు రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఎదుళ్ల ప్రతాప్‌రెడ్డి, నయనాచారి, రంజిత్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ విజయప్రసాద్, డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని శాలువాతో సన్మానిస్తున్న హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాదారం కృష్ణ, చిత్రంలో చైర్మన్ చెకోలేకర్ లక్ష్మి తదితరులు (మలక్ పేట, ప్రభాతవార్త)